క్లుప్తంగా

యోగ సాధనతో మెరుగైన ఆరోగ్యం

పర్చూరు(చినగంజాం): యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యాన్ని సాధించుకోవాలని పర్చూరు అంగన్‌వాడీ సీడీపీవో సుభద్ర అన్నారు. మంగళవారం అంతర్జాతీయ మహిళా సాధికార వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు పర్చూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యం గురించి ఆమె అంగన్‌వాడీ సిబ్బందికి తెలియజేశారు. కార్యకర్తలకు యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు దీపాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం

చీరాల రూరల్ : లోక్ అదాలత్‌లలో కక్షిదారులకు సత్వరమే న్యాయ సరిష్కారం దొరుకుతుందని.. కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులను రాజీ మార్గంలో లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ కక్షిదారులకు సూచించారు. స్థానిక కోర్టు భవన సముదాయంలో ఈనెల 8న ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మంగళవారం తెలిపారు. ఈ అదాలత్‌లో రాజీ చేయదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు చెన్‌బౌన్స్, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. న్యాయమూర్తుల సమక్షంలో పరిష్కరించిన కేసులు ఇతర కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవకాశం లేదన్నారు. అలానే రాజీమార్గంలో పరిష్కరించిన సివిల్ కేసుల్లో గతంలో కక్షిదారులు కోర్టుకు చెల్లించిన ఫీజులు కూడా వాపసు ఇస్తామని తెలిపారు. అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలీసులు, న్యాయవాదులు తమ సహకారం అందించాలని న్యాయమూర్తి సూచించారు.

సునీల్‌కుమార్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ నిరసన



పర్చూరు(చినగంజాం): ఐపీఎస్ అధికారి, మాజీ సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్‌పై ప్రభుత్వం విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ దళిత నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక బొమ్మల సెంటర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన దళితుడైనందు వలన కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని గేరా స్వరాజ్ కుమార్ విమర్శించారు. ఆయనపై సస్పెన్షన్ వెంటనే ఎత్తి వేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మార్టూరు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం ఉదయం మండల పరిధిలోని జంగమహేశ్వరపురం వద్ద జరిగింది. అందిన వివరాల మేరకు.. జె పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన మురకొండ సిసింద్రీ అలియాస్ చిట్టిబాబు (35) బల్లికురవ సమీపంలోని ఓ క్వారీలో క్రేన్ ఆపరేటర్‌గా పని చేస్తుంటాడు. సోమవారం రాత్రి నైట్ డ్యూటీ ముగించుకున్న సిసింద్రీ మంగళవారం ఉదయం ఐదున్నర గంటల ప్రాంతంలో బైకుపై రామకూరు బయలుదేరాడు. జంగమహేశ్వరపురం సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన గల తాటి చెట్టును ఢీకొని బైక్ తో సహా రోడ్డు మార్జిన్‌లో పడిపోయాడు. ప్రమాదంలో సిసింద్రీపై బైకు పడటంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో సిసింద్రీని గమనించిన స్థానికులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్సై షేక్ సైదా ప్రమాద స్థలికి వెళ్లి మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సిసింద్రీకి 12, 10 సంవత్సరాలు వయసు గల ఇద్దరు మగ పిల్లలు, భార్య ఉన్నారు. మృతుడి భార్య మురకొండ వెంకట శోభారాణి ఇచ్చిన ఫిర్యాదు పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూలీల ఆటో బోల్తా

జే.పంగులూరు: శనగ కోతకు వెళ్తున్న కూలీల ఆటో బోల్తా పడటంతో ఇద్దరి కూలీలకు గాయాలయ్యాయి. ఈఘటనలో మండలంలోని కోటపాడు పొలాల్లో మంగళవారం జరిగింది. అందిన వివరాల మేరకు మండల పరిధిలోని బైటమంజులూరు గ్రామానికి చెందిన మహిళా కూలీలు 15 మంది ఆటోలో కోటపాడు గ్రామంలో గల శనగ పైరును కోసేందుకు బయలు దేరారు. ఆటో కోటపాడు పొలాల్లో వెళ్తుండగా టైరు గట్టు మీదకు ఎక్కడంతో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చిలకలూరిపేట ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు.

అర్జీల విచారణలో అలసత్వం తగదు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, రెవెన్యూ అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మత్తులో మార్టూరు..
వసూళ్లలో ఖాకీలు!

'ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే నేను నా బెల్ట్ తీస్తా..' సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అసెంబ్లీలో లిక్కర్ బెల్ట్ షాపుల గురించి గతంలో చేసిన వ్యాఖ్యలు. ఆయన మాటలు నసేమిరా అంటూ నిర్వాహకులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మద్యం షాపుల పక్కనే పర్మిట్ రూములు ఏర్పాటు చేసుకొని మద్యం ప్రియులను పూటుగా తాగిస్తున్నారు. బరితెగించిన కొందరు మద్యం మత్తులో దాడులు, హత్యలకు సైతం పాల్పడుతున్నారు. ఫలితంగా గ్రామాల్లో కుటుంబాలు ఆర్థికంగా చితికి గుల్లవుతున్నాయి..

- మార్టూరు మండలంలో అనధికార బార్ అండ్ రెస్టారెంట్లు
- మద్యం మత్తులో దాడులు జరిగినా కేసులు పెట్టని వైనం
- మామూళ్ల మత్తులో పోలీసు, ఎక్సైజ్ అధికారులు
- గుల్లవుతున్న కుటుంబాలు



మార్టూరులోని వైన్స్ షాప్‌కు అనుబంధంగా అనధికారికంగా నిర్వహిస్తున్న రెస్టారెంట్

మార్టూరు:

నియోజవర్గంలో తాగడానికి నీరు దొరకదేమో కాని మద్యం మాత్రం పుష్కలంగా 24/7 దొరుకుతోంది. మూడు క్వార్టర్లు ఆరు ఫుల్ బాటిళ్లలా రోజురోజుకూ గ్రామాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. గ్రామాల్లో ఉన్న బెల్టు షాపులు ప్రస్తుతం రెస్టారెంట్లుగా అప్‌డేట్ అయ్యాయంటే ఆశ్చర్యం వేయక మానదు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సగటున మండలానికి 20కి పైగా అంటే 100కు పైగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న విషయం ప్రజలతో పాటు ఎక్సైజ్, పోలీసు శాఖలకు బాగా తెలుసు. అధికారికంగా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయాలంటే అనుమతులతో ఇతరత్రా ఖర్చులు కలిపి రూ. 20 నుంచి 25 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కానీ ఎక్సైజ్, స్థానిక పోలీస్ స్టేషన్లకు రోజువారి మామూళ్లు సమర్పించుకుంటే రూ.1 లక్ష ఖర్చుతో వైన్ షాపుకు అనుబంధంగా ఓ రకమైన షెడ్డు ఏర్పాటు చేసుకొని దండిగా సంపాదించుకోవచ్చు. నియోజకవర్గంలోని ప్రతి లిక్కర్ షాపుకు అనుబంధంగా ఇలాంటి అనధికార రెస్టారెంట్లు ఏర్పాటు చేశారు. ఈ సిట్టింగుల షాపు వద్ద ఒక్కో రకమైన రేట్లు ఉండటం ఆశ్చర్యకరం. సిట్టింగులు ఏర్పాటు చేసుకున్న వారు వైన్స్ షాపు నిర్వాహకులకు పగలు రూ.3000 రాత్రిపూట రూ.3 వేల చొప్పున నెలకు సుమారు రూ.2 లక్షలు వసూలు చేసే వైన్స్ షాపులు కూడా ఉండటం గమనార్హం. కొన్నిచోట్ల పగలు ఒకరు, రాత్రుళ్లు మరొకరు నిర్వహించుకునేలా ఏర్పాట్లు కూడా చేసుకున్నారు. ఈ విధంగా మార్టూరులోని మూడు వైన్స్ షాపులకు అనుబంధంగాను మండలంలోని జొన్నతాళి, ద్రోణాదుల, వలపర్ల గ్రామాల్లో సైతం ఇదే ఒరవడి కొనసాగుతోంది.

పోలీసులా? మాకేం భయం లేదు..

ఇంత యథేచ్ఛగా పగలు రాత్రి తేడా లేకుండా నిర్వహిస్తున్న సిట్టింగ్ షాపుల విషయమై వాటిల్లో పనిచేసే కొంతమంది సిబ్బందిని విలేకరులు ఆరా తీయగా అనేక ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. ప్రతి వైన్స్ షాప్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసిన సిట్టింగ్ షాపుల నిర్వాహకులతో పాటు మందుబాబులకు అవసరమైన కూల్ డ్రింక్స్, వాటర్ బాటిళ్లు, చిరుతిళ్లు సప్లై చేసే బడ్డీకొట్ల నిర్వాహకుల నుంచి సైతం నెలవారి మామూళ్లు పోలీసు, అబ్కారీ శాఖలకు అందుతుండటంతో ఎలాంటి తనిఖీలు జరగవు. కనుక యథేచ్ఛగా సిట్టింగ్ షాపులు నిర్వహిస్తున్నారు. కేవలం సిట్టింగ్ షాపుల నిర్వాహకుల నుంచే కాక ప్రతి బెల్టు షాపు నుంచి ప్రతి నెల ఎంతో కొంత చేతులు తడపందే ఒప్పుకోరని బెల్టుషాపు నిర్వాహకులు వాపోతున్నారు.

వసూళ్లలో బాద్‌షా..

మండలంలోని ఈ అనధికార రెస్టారెంట్ల తాలూకు వసూళ్లు స్టేషన్‌కు చెందిన ఓ ద్వితీయ శ్రేణి అధికారి కనుసన్నల్లో నడుస్తున్నట్లు నిర్వాహకులే చెప్పడం విశేషం. ఎల్లప్పుడూ వసూళ్లకు సై అంటూ ఉండే ఈ అధికారి స్థానిక పోలీసు బాస్‌కు కుడి భుజంగా వ్యవహరిస్తూ అన్ని తానై వ్యవహరిస్తున్నారు. ఈ అధికారికి బహు 'బాషా' కోవిదుడైన మరో కిందిస్థాయి అధికారి కూడా నిత్యం నీడలా ఉంటూ సహకరిస్తూ ఉండటం పరిపాటి. లిక్కర్ షాపుల వ్యవహారం ఎక్సైజ్ శాఖకు సంబంధించినది అయినప్పటికీ వాటి తాలూకు ఫలితాలు ఎక్కడికక్కడ స్థానిక పోలీసులకే ఎక్కువగా దక్కడం విశేషం. నైట్ బీట్‌లకు వెళ్లిన సిబ్బంది అక్కడే తినటం, తాగడం, వసూలు చేసుకోవడం నిత్యకృత్యమైనట్లు నిర్వాహకులు చెప్తున్నారు.

సిట్టింగులకు ఎలాంటి అనుమతులు లేవు..

ప్రస్తుతం లిక్కర్ షాపులకు అనుబంధంగా నిర్వహిస్తున్న అనధికార రెస్టారెంట్లకు ఇప్పటివరకు ఎలాంటి అనుమతులు లేవు. ఇకముందు వస్తాయేమో తెలియదు. జొన్నతాళి సూర్య దాబా వద్ద జరిగిన ఘర్షణ విషయం పేపర్లలో చూసి తెలుసుకున్నాను. సిబ్బందిని పంపి విచారణ చేపిస్తాను.

– భుజంగరావు, ఎక్సైజ్ సీఐ



ద్రోణాదులలోని వైన్స్ షాప్ ఎదురుగా నిర్వహిస్తున్న అనధికార రెస్టారెంట్



జొన్నతాళి సూర్య దాబా వద్ద యువకుల దాడిలో గాయపడిన ఒడిశా వాసులు (ఫైల్)

మార్టూరులో ప్రశ్నార్థకంగా శాంతి భద్రతలు..

అనధికారిక సిట్టింగ్ రెస్టారెంట్ల కారణంగా మందుబాబులు తీరిగ్గా మద్యం తాగుతూ మాటా మాటా పెరిగి ఘర్షణలు జరగడం నిత్య కృత్యమైంది. ఫిబ్రవరి 26వ తేదీ బుధవారం రాత్రి స్థానిక జొన్నతాళి సెంటర్‌లోని సూర్య దాబాలో 8 మంది యువకులు మద్యం తాగి నిర్వాహకులపై బీరు సీసాతో దాడి చేశారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో కోలలపూడి గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులు ఒడిశా రాష్ట్రానికి చెందిన దాబా నిర్వాహకులు అయిన గూగుల్లా, మున్నా, రాజులపై జరిగిన దాడిపై ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పోలీసులు వచ్చి బాధితులను ఆసుపత్రికి తరలించినా మెడికో లీగల్ కేసు అయినప్పటికీ టీడీపీ నాయకులు బాధితులను బెదిరించి తమదారికి తెచ్చుకున్నారు. దీంతో ఇక్కడ శాంతిభద్రతలు ఎంత అధ్వానంగా ఉన్నాయో అర్థమవుతుంది.

- స్థానిక జాతీయ రహదారిపై రాజుపాలెం సెంటర్‌లో ఉన్న ఓ ఫంక్షన్ హాలులో స్థానిక టీడీపీ నాయకులు పగలు మద్యం, పేకాట రాత్రుళ్లు వ్యభిచారం నిర్వహిస్తున్నారనేది ఆ ప్రాంతంలో బహిరంగ రహస్యం. జనవరి నెలలో స్థానిక పోలీసులు దాడి నిర్వహించి సదర నాయకులను స్టేషన్‌కు తరలించారు. నిత్యం పోలీస్ స్టేషన్ చూరు పట్టుకుని వేలాడుతూ పంచాయతీలు నిర్వహించే ప్రత్యేక నిఘా విభాగానికి చెందిన అధికారి నాయకులకు, పోలీసులకు మధ్య విజయవంతంగా సయోధ్య కుదర్చడం, నిర్వహణ యథాతథంగా కొనసాగుతోంది. లిక్కర్ షాపులకు అనుబంధంగా నిర్వహిస్తున్న సిట్టింగ్ షాపుల వలన తరచూ జరుగుతున్న గొడవల వలన శాంతి భద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అధికారులు ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకొని నియంత్రించాలని కోరుతున్నారు.

ఉపాధి నిర్వహణలో జవాబుదారీతనం ఉండాలి



పంగులూరులో ప్రజావేదిక నిర్వహిస్తున్న పీడీ

జే.పంగులూరు: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారితనం ఉండాలని డ్వామా పీడీ విజయలక్ష్మి అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై మంగళవారం పంగులూరులోని ఎంపీడీవో పరిషత్ కార్యాలయంలో వద్ద ప్రజా వేదిక నిర్వహించారు. ఎంపీడీవో కే స్వరూపరాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీడీ సోషల్ ఆడిట్‌పై సమీక్ష నిర్వహించారు. మండలంలోని గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ. 9.69 కోట్ల విలువ చేసే పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల వారిగా సోషల్ ఆడిట్‌పై గుర్తించి లోపాలపై సమీక్ష చేసిన పీడీ మాస్టర్ లోపాలు, ప్రొసిజర్ ల్యాప్స్‌కు సంబంధించిన రూ. 17 వేలను సిబ్బంది నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. ఈఆర్థిక సంవత్సరంలో మండలంలో రూ. 10 కోట్ల వ్యవసాయ అంచనాలతో పనులు చేపడుతున్నట్లు విజయలక్ష్మి తెలిపారు. మండలానికి 210 రైతు వారి కుంటలు కేటాయించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ప్రమీల, పంచాయితీరాజ్ ఏఈ హోను మంతురావు, విజిలెన్స్ అధికారి శోభన్, ఏపీడీకోటయ్య నాయక్, పీఆర్పీలు, ఈసీ మురళి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

అద్దంకి రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలపై బుధవారం విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పీ. ఆదాం, యూనియన్ కార్యదర్శి గాలి భీష్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

కారంచేడు: అన్ని గ్రామాల పరిధిలో ఈ ఏడాది సాగు చేసిన వివిధ రకాల పంటల యజమానులు తప్పకుండా మీ పంటలను ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏవో కే సుధీర్‌బాబు అన్నారు. మండలంలోని జరుబులవారిపాలెం, నాయుడువారిపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో రైతులకు ఈ-కేవైసీలతో పాటు, పంటలలో ఆశించే తెగుళ్ల వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు కిషోర్, వీహెచ్ఏ గురవయ్య, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన రబీ ఈ-క్రాప్ నమోదు

అద్దంకి రూరల్: రబీలో ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని సహాయ వ్యవసాయ సంచాలకులు కే ధన్‌రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని వెంపరాల, చక్రాయపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్ మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని అన్ని రైతు సేవాకేంద్రాల్లో ముసాయిదా జాబితా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి కొత్రపాటి వెంకట కృష్ణ మాట్లాడుతూ కందులు మద్దతు ధర రూ. 7550 కు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. పొలం ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్యను పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో రేణుక, వీఏఏ శేషయ్య రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం పరిశీలన



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ గోపీకృష్ణ

చీరాల టౌన్: ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్నీ విధాల చర్యలు తీసుకున్నామని తహశీల్దార్ కె.గోపీకృష్ణ తెలిపారు. మంగళవారం జరుగుతున్న ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష కేంద్రాలను తహశీల్దార్ పరిశీలించారు. విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు తదితర వసతులను పరిశీలించారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులు, గైర్హాజరైన విద్యార్థుల వివరాలను సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, మాల్‌ప్రాక్టీస్, కాపీయింగ్ జరగకుండా పరీక్షలకు నియమించిన సిబ్బంది వ్యవహరించాలని తహశీల్దార్ సూచించారు. ఆయన వెంట వీఆర్వో కళ్యాణ్, సిబ్బంది ఉన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు ప్రత్యేక కృషి



బ్రోచర్ ఆవిష్కరణ చేస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి

అద్దంకి రూరల్: ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యా వ్యవస్థలు, సామాజిక కార్యకర్తలు సమన్వయంతో కృషి చేస్తే హెచ్ఐవీ ఎయిడ్స్‌ను సమాజం నుంచి నిర్మూలించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ కె విజయమ్మ అన్నారు. మంగళవారం ఆకాడే సందర్భంగా స్థానిక తురకయ్యపాలెం అప్పర్ ప్రైమర్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ హెచ్ఐవీ కేసుల నమోదులను రాష్ట్రంలో జీరో స్థాయికి తీసుకెళ్లే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ 'మీకు తెలుసా' అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవగాహన కార్యక్రమాల పూర్తి సమాచారాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్, జిల్లా వైద్యాధికారి హెల్ప్ టీఐ ప్రోగ్రామ్ మేనేజర్ డీసీహెచ్ కోటేశ్వరరావు, ఔట్రీ వర్కర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం: బాల్య వివాహలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ చదువుకునే వయస్సులో బాలికలకు వివాహాలు చేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పురుషులతో పాటు సమానంగా మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు ఉన్నాయన్నారు. ఏవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే 112కి ఫోన్ చేస్తే పోలీసులు రక్షణ కల్పిస్తారన్నారు. మీ పట్ల అనుచితంగా ప్రవర్తించినా వారిని శిక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ చెరుకూరి రాంబాబు, బుద్ది మోహనరావు, వేణుగోపాలరావు, పాల్గొన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): సమాజంలో ఎదురయ్యే సవాళ్లను మహిళ ఎదుర్కొనే శక్తి రావాలని ఎస్సై జీ సురేష్ అన్నారు. మహిళా సాధికారిత వారోత్సవాలలో భాగంగా ఇంకొల్లులోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన డిబేట్ కార్యక్రమానికి ఎస్ఐ జీ సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీపీఎం బ్యాంక్ లింకేజ్ లక్ష్మణాచారి, ఏపీఎం అనూరాధ, సీసీలు అంజిరెడ్డి ,సీహెచ్ రాజశేఖర్, ఇంకొల్లు ఉమెన్ ఏఎస్ఐ ఎం నాగలక్ష్మి పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మేరమ్మ

యద్దనపూడి: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను దళారులకు అమ్మి మోసపోవద్దని వ్యవసాయాధికారి మేరమ్మ రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పూనూరు, గన్నవరం గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మార్క్‌ఫెడ్‌లో పంట ఉత్పత్తులను అమ్ముకోవాలని సూచించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కావాలంటే ప్రస్తుతం మార్కెట్ మీద అవగాహన కలిగి ఉండాలన్నారు. మద్దతు వచ్చేంతవరకు కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ హరిష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ బ్యాగుల పంపిణీ

జే.పంగులూరు: మండలంలోని ఉపాధ్యాయులకు యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా మంగళవారం బ్యాగులను యూటీఎఫ్ నాయకులు పంపిణీ చేశారు. ఇటీవల కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా మండలలోని 220 మంది ఉపాధ్యాయులకు, సిబ్బందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఎల్ లక్ష్మి శ్రీనివాసులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రవిచంద్రబాబు, బత్తుల సుబ్బారావు, , ఉపాధ్యక్షులు కే సోమశేఖర్, కోశాధికారి ఎస్‌కె ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీ- ముగ్గురికి గాయాలు



ప్రమాద స్థలంలో ఢీకొట్టుకున్న బస్సు, టిప్పర్



గాయపడిన బస్సు డ్రైవర్

పర్చూరు (చినగంజాం): ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఈఘటన మంగళవారం రాత్రి పర్చూరు మండలం దేవరపల్లి గ్రామం వద్ద చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. నరసరావుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చీరాల నుంచి నరసరావుపేటకు వెళ్తోంది. బస్సు పర్చూరు మండలం దేవరపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారి చప్టాపై చిలకలూరిపేట నుంచి ఎదురుగా అత్యంత వేగంగా వస్తున్న టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీ కొట్టింది. రెండు వాహనాలు ప్రమాదంలో నుజ్జునుజ్జయ్యాయి. ఈఘటనలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు రెండు కాళ్లు విరగగా అతని వెనక కూర్చున్న ఇద్దరి మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆర్టీసీ డ్రైవర్ మరొక మహిళను పర్చూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మరొక మహిళను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకుని వెళ్లారు. ఘటనా స్థలాన్ని పర్చూరు ఎస్సై మాల్యాద్రి సందర్శించి రోడ్డుపై వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



యర్రబాలెంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో శ్రీనివాసరావు

మేదరమెట్ల: వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఏవో శ్రీనివాసరావు అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం , యర్రబాలెం గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రైతుసేవా కేంద్రంలో ఈ రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఘర్షణ

చీరాల: చీరాల మండలం గవినివారిపాలెంలో స్థల వివాదంలో రెండు కుటుంబాల వారు ఘర్షణకు దిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. గవినివారిపాలేనికి చెందిన చిప్పలపల్లి పద్మ, కామేశ్వరమ్మల మధ్య స్థల వివాదం ఉండడంతో మంగళవారం ఇరు కుటుంబాలు దాడులకు పాల్పడ్డారు. కామేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిప్పలపల్లి పద్మపై కేసు నమోదు చేయగా చిప్పలపల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కామేశ్వరమ్మపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

చీరాల డివిజన్
90101 55593 (చీరాల)

Office mail : sakshiongads@gmail.com